క్లుప్తంగా

ఉపాధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రేటూరు(కాకుమాను): గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఈఈ కె.మాల కొండయ్య అన్నారు. రేటూరు, చిన లింగాయపాలెంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సింగారావు, సిబ్బంది ఉన్నారు.

విశ్వరూప మహాసభను జయప్రదం చేయండి

గుంటూరు రూరల్(ప్రత్తిపాడు): ఆగస్టు రెండవ వారంలో హైదరాబాద్ నగరంలో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని మాదిగ మహిళా సమాఖ్య నాయకురాలు ఏసిపోగు వాణి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు కె.అంకయ్య, గుడిపూడి కన్నా, నియోజకవర్గ కన్వీనర్ తోడేటి యేసుపాదం మాదిగ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అధ్యక్షతన ఎస్సీ వర్గీకరణ కోసం 29 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ న్యాయమైన అంశంగా అన్ని జాతీయ పార్టీలు, రాజకీయ పార్టీలు ఆమోదం తెలుపుతున్నా వాటిని ఆచరించి ఎస్సీ వర్గీకరణ చేయడంలో నిర్లక్ష్యం జరుగుతోందన్నారు. హైదరాబాదులో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభకు అన్ని మాదిగ పల్లెల నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లి సభను జయప్రదం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కారసాల శాంసన్ మాదిగ, పులి చందు మాదిగ, చీలి ప్రమోద్ మాదిగ, గుడిపూడి కన్నా మాదిగ, మాదిగ మహిళ నాయకురాలు కారసాల పున్నమ్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సుభిక్షం..'జగనన్న సురక్ష' లక్ష్యం


ధ్రువపత్రాలు అందుకున్న అర్జీదారులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

కాకుమాను: రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు. స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో శుక్రవారం గ్రామ సచివాలయం-2 పరిధిలోని ప్రజలకు జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా మండల వ్యాప్తంగా నేటి వరకు 10,484 మంది ప్రజలకు వివిధ రకాల ధ్రువపత్రాలు ఉచితంగా అందజేసినట్లు ఆయన తెలిపారు. కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క కాకుమాను గ్రామంలోనే వివిధ పథకాల ద్వారా అర్హులకు రూ.21 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా.. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న దేశంలో ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులకు వివిధ రకాల సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శివకుమారి, మండల ఉపాధ్యక్షుడు పెదపూడి కపిల్, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సుభాని, కోంద్రు అప్పారావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పంగులూరి శ్రీనివాసరావు, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డీ జవహర్‌లాల్ నెహ్రూ, ఏఓ కె.కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తమ కుటుంబంలో ఒకడిగా సమస్యలను పరిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు.


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు'

సమస్యల పరిష్కారానికి 'జగనన్న సురక్ష'

పెదనందిపాడు: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సుభాని అన్నారు. పెదనందిపాడులో శుక్రవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జగనన్న సురక్ష పథకంలో అర్జీలు పెట్టుకుంటే వాటిని త్వరితగతిన పరిష్కరించి, ధ్రువపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. 639 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. ఎంపీపీ హెప్సిబా, వైస్ ఎంపీపీలు ఎస్కే ఖాశింబీ, కె.సాంబశివరావు, సర్పంచ్ దాసరి పద్మారావు, ఎంపీడీవో రాజగోపాల్, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశింపీరా, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పేదల రక్ష

గుంటూరు రూరల్: ఇంటి వద్దకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వార్డు సచివాలయాలను ఏర్పాటు చేశారని నగర మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ డి.రవీంద్ర అన్నారు. శుక్రవారం 26వ డివిజన్ అంకిరెడ్డిపాలెంలో పొత్తూరు, అంకిరెడ్డిపాలెం గ్రామాల ప్రజలకు జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ఏ ఒక్కరూ అర్హత ఉండి సంక్షేమ పథకం అందకుండా ఉండకూడదు అనే జగనన్న సురక్షని నెల రోజులపాటు నిర్వహించారని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలకు 416 ధ్రువ పత్రాలు, ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, గ్రామ మాజీ సర్పంచ్ శ్యామల బ్రహ్మారెడ్డి, వలంటీర్లు పాల్గొన్నారు

గొడవర్రులో మురుగునీటి సమస్యకు పరిష్కారం


గొడవర్రు(చేబ్రోలు): మండలంలోని గొడవర్రు గ్రామంలో మురుగునీటి సమస్యకు అధికారులు శుక్రవారం శాశ్వత పరిష్కారం చూపారు. సమస్యాత్మక ప్రాంతమైన గొడవర్రులోని ముస్లిం మైనార్టీలకు చెందిన ప్రాంతంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సైడ్ కాలువలు సక్రమంగా లేకపోవటంతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. సమస్యను స్థానికులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వారి ఆదేశాల మేరకు మండలాధికారుల బృందం పర్యవేక్షణలో సమస్యను పరిష్కరించారు. డీఎల్‌పీవో స్వరూపారాణి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, గ్రామ సర్పంచ్ బీరం జానకీదేవి, ఎస్ఐ కె.ఆనంద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జేసీబీ సహాయంతో రెండు సిమెంట్ తూములను డ్రెయిన్‌లో వేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. మురుగునీరు నిల్వ ఉండకుండా పూడికను తొలగించారు. సమస్య పరిష్కారం కావటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సహస్రలింగేశ్వరస్వామి ఆలయ హుండీల రాబడి రూ.16.87 లక్షలు



చేబ్రోలు: పొన్నూరు పట్టణంలో ఖ్యాతిగాంచిన సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని శుక్రవారం దేవదాయశాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. దేవస్థానం ప్రాంగణంలోని ఆరు ఆలయాలకు చెందిన 20 హుండీల నుంచి రూ.16,87లక్షల రాబడి వచ్చినట్లు అధికారులు రమణమ్మ, తుల్లిమిలి శ్రీనివాస్ తెలిపారు.

'విజ్ఞాన్'లో ఘనంగా చైర్మన్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలు


రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శుక్రవారం చైర్మన్ లావు రత్తయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన మెగా రక్తదాన శిబిరంలో 356 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. పొన్నూరు మండలం బ్రాహ్మణ కోడూరులోని చిన్న పిల్లల, తెనాలిలోని స్మైల్ అనాథాశ్రమాలకు, గాంధీ ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేశారు. సంగం జాగర్లమూడి, వేజెండ్ల పాఠశాలల పిల్లలకి స్పోర్ట్స్, క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. వర్సిటీలో విద్యార్థులు, కళాశాల సిబ్బందితో కలిసి చైర్మన్ లావు రత్తయ్య భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులతో తనకున్న అనుబంధం మాటల్లో వర్ణించలేనిదన్నారు. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజును ఇలా విద్యార్థుల మధ్య జరుపుకోవడానికి ఇష్టపడతానన్నారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, వైస్ చైర్‌పర్సన్ బోయపాటి రుద్రమదేవి, వీసీ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, డీన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులాలో..

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను చేరాలని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య పేర్కొన్నారు. పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ ప్రాంగణంలో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రత్తయ్య కేక్ కట్ చేసి, విద్యార్థులకు స్వీట్లు పంచారు. వారికి మంచి మార్గదర్శకాలు చేశారు. కూర్మనాథం మాట్లాడుతూ పదుల సంఖ్యలో వివిధ విద్యాలయాలు స్థాపించి, వేల మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న రత్తయ్య పూర్ణాయుష్షులై వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం విజ్ఞాన్ విద్యార్థులంతా రత్తయ్య ఆశయాలు నెరవేరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. విజ్ఞాన్ నిరుల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనురాధ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవీ రావు, హై స్కూల్ ప్రిన్సిల్ శ్రీనివాసరావు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



వర్సిటీలో జరిగిన జన్మదినోత్సవాల్లో కేక్ కట్ చేస్తున్న చైర్మన్ లావు రత్తయ్య

'చలపతి ఫార్మసీ'లో ముగిసిన జాతీయస్థాయి సదస్సు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ ఎం.విలియంకేరి

గుంటూరు రూరల్: ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం సమాజంలో యాంటీబయాటిక్ నిరోధకత ప్రమాదకరంగా పెరిగిందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.విలియంకేరి తెలిపారు. రెండు రోజులుగా నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో ఏఎస్‌యూ ఐఎస్‌పీవోఆర్ స్టూడెంట్ చాప్టర్, అమరావతి రీజినల్ చాప్టర్ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి యాంటీ మైక్రోబియల్ స్టీవార్డ్ షిప్, క్లినికల్ అప్లికేషన్స్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాల మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ వి.వెంకటకిరణ్ మాట్లాడారు. యాంటీ బయాటిక్స్ విరివిగా వాడుతున్నందుల్ల కొన్ని సందర్భాల్లో మానసిక దుష్ప్రభావాలు కలుగజేయటమే కాకుండా నిరాశ, ఆందోళన కలిగిస్తాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామరావు మాట్లాడుతూ సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. సదస్సులో 200 మందికి పైగా ప్రతినిధులు, వివిధ ఫార్మసీ సంస్థల ప్రిన్సిపల్స్, ఫ్యాకల్టీ, వైద్యులు పాల్గొన్నారు. ఈ రెండు రోజుల్లో, డాక్టర్ జె.గౌతమ్‌కుమార్, డాక్టర్ జి.ప్రభాకర్‌రావు రెండు ప్లీనరీ సెషన్స్ నిర్వహించారు. 65కి పైగా ఈ పోస్టర్లు ప్రదర్శించారు. వాటిలో కాకినాడకు చెందిన ఆదిత్య కళాశాల విద్యార్థి అలియారామ్‌కు ప్రథమ, చలపతి ఫార్మసీ విద్యార్థి కె.భావన కు ద్వితీయ, శ్రీకాకుళం శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల విద్యార్థి బి.ప్రవీణ్‌కు తృతీయ బహుమతులు దక్కాయి. విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో చలపతి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ కరెస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ జాన్‌వెస్లీ

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జాన్ వెస్లీ అన్నారు. శుక్రవారం అడవి తక్కెళ్ళపాడు గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునేందుకు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని సూచించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. పౌండేషన్ సభ్యులు రామారావు, శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో పర్యావరణ దినోత్సవం

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో పర్యావరణ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. కాలుష్యాన్ని నివారణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ముగిసిన అధ్యాపకుల శిక్షణ

గుంటూరు రూరల్: సాంకేతిక విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు శిక్షణ పొందడం అవసరమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ అన్నారు. రెండు రోజులుగా చౌడవరంలోని కళాశాలలో ఐఎస్‌టీఈ చాప్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇండక్షన్ ట్రైనింగ్ ఫర్ టీచర్స్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అధ్యాపకులు సులభతర పద్ధతిలో విద్యాబోధన చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన శివశివాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మానేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీ రమణారావు, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్-ప్రాక్టీస్ అండ్ హెడ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆపరేషన్స్ ప్రొఫెసర్ కేవీఎస్ కృష్ణమోహన్ పాల్గొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థుల నైపుణ్యాన్ని పెంచేందుకు అందించాల్సిన బోధనా విధానాన్ని వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడం ద్వారానే తమ కళాశాల మంచి ఫలితాలను సాధించటం జరుగుతుందన్నారు. ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాలలో 134 మంది అధ్యాపకులు పీహెచ్‌డీ పట్టభద్రులు ఉండటం గర్వకారణమన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్ అతిథులను సన్మానించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, డాక్టర్ బాలప్రసాద్ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

చేబ్రోలు: పొన్నూరు ప్రాంతంలోని దళిత క్రైస్తవుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని క్రైస్తవ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన ఫాదర్ మద్దు బాలస్వామి పేర్కొన్నారు. నిడుబ్రోలు అంబేడ్కర్ నగర్‌లోని సెయింట్ ఆన్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి, అస్వస్థతకు గురైన బొల్లెద్దు బెన్‌హర్‌ను పరామర్శించారు. 30న పొన్నూరులో మణిపూర్ క్రైస్తవుల కోసం జరుగు శాంతి ర్యాలీని విజయవంతానికి సూచనలు చేశారు. ఆయనను మాల మహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు ఘనంగా సత్కరించారు. నాయకులు జోసఫ్, సుధాకర్, డేనియల్, నరేంద్ర మాదవ్, కత్తి కిరణ్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

రూ.1.63 లక్షల విలువైన ఎరువులు స్వాధీనం

నగరంపాలెం: జిల్లాలోని ప్రత్తిపాడులో మూడు ఎరువు, పురుగు మందుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఈ తనిఖీలు కొనసాగాయి. ఇద్దరు డీలర్లు సక్రమంగా రికార్డులు నిర్వహించకుండా వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. ఆయా దుకాణాల నుంచి రూ.1.63 లక్షల ఖరీదు చేసే 14.150 మెట్రిక్ టన్నుల ఎరువులు స్వాధీనం చేసుకుని, రెండు '6ఏ' కేసులు నమోదు చేశారు. ఇక మూడు దుకాణాల్లో ప్రిన్సిపల్ ధ్రువీకరణ పత్రాల్లేకుండా విక్రయాలు చేస్తున్న రూ.1.63 లక్షల విలువైన పురుగు మందుల అమ్మకాలు నిలిపివేశారు. తనిఖీల్లో వ్యవసాయ అధికారిణి జె.వాసంతి, తహసీల్దారు కె.నాగమల్లేశ్వరరావు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ఉండాలి

పెదకాకాని: సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవడంతోపాటు మంచి ఆహార ఉత్పత్తులను దిగుబడి చేయవచ్చని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ శాంతి శ్రీ అన్నారు. మండలంలోని నంబూరు గ్రామంలో మహిళా రైతులకు శుక్రవారం సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఆమె శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శాంతి శ్రీ మాట్లాడుతూ సరైన పద్ధతిలో వ్యవసాయం చేయకపోతే పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడం ద్వారా నీరు, నేల, వాయువు కలుషితం కాకుండా రక్షించుకోవచ్చన్నారు. ఇంటి ఆవరణలో ఖాళీ స్థలం ఉన్నట్లయితే పెరటి తోటలు పెంచుకోవచ్చని తెలిపారు. డాక్టర్ జ్యోతి, పద్మావతి, షరీఫ్, బ్రహ్మారెడ్డి, కోమల పాల్గొన్నారు.


సేంద్రియ వ్యవసాయంపై మహిళా రైతులకు అవగాహన

30న మండల సర్వసభ్య సమావేశం

గుంటూరు రూరల్: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు సమావేశం ఎంపీపీ పులగం దివ్య అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి వైఎస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలాధికారులు, కార్యదర్శులు హాజరు కావాలని తెలిపారు.